నీట్ దీర్ఘకాలిక శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నేడు చివరి రోజు

రాయదుర్గం: 2024–25 విద్యా సంవత్సరానికి నీట్‌లో అర్హత సాధించేందుకు దీర్ఘకాలిక శిక్షణ పొందేందుకు అర్హత కలిగిన విద్యార్థుల నుంచి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ దరఖాస్తులను కోరుతోందని గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల/ పాఠశాల ప్రిన్సిపాల్ ఏ. శారద ఆదివారం తెలిపారు. నగరంలోని టీజీ ఎస్ఆర్‌సీ సీఓఈ గౌలిదొడ్డి, నార్సింగి, చిల్కూర్, మహేంద్రహిల్స్ గురుకులాల్లో నీట్ కోసం లాంగ్ టర్మ్ శిక్షణ ఇస్తారని తెలిపారు. అర్హులైన షెడ్యూల్ కులాలకు చెందిన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులకుపైన తెలిపిన విద్యాలయాల్లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించి నీట్–2024 పరీక్ష రాసిన విద్యార్థులకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు గురుకులాల సొసైటీ వెబ్‌సైట్ ద్వారా రూ.200 చెల్లించి ఈనెల 24వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఒలింపిక్‌లో రాణించాలి



గచ్చిబౌలి హాకీ స్టేడియంలో ఒలింపిక్ రన్ నిర్వహిస్తున్న కొండా విజయ్

గచ్చిబౌలి: త్వరలో జరగబోయే ఒలింపిక్‌లో భారత క్రీడాకారులు రాణించాలని హాకీ తెలంగాణ అధ్యక్షులు కొండా విజయ్ పేర్కొన్నారు. ఆదివారం గచ్చిబౌలి హాకీ స్టేడియంలో ఒలింపిక్ ధినోత్సవం సందర్భంగా రన్ నిర్వహించారు. కొద్ది రోజుల్లో ప్యారీస్‌లో జరగనున్న ఒలింపిక్‌లో హాకీతో ఇతర క్రీడల్లో భారత క్రీడాకారులు రాణించాలని ఆయన ఆకాంక్షించారు. గతంలో ఒలంపిక్‌లో మంచి ప్రతిభ కనబర్చారని ఈసారి కూడా సత్తా చాటాలన్నారు. ఈ సందర్భంగా హాకీ లెజెండ్ ధ్యాన్‌చంద్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో హాకీ తెలంగాణ సెక్రటరీ భీంసింగ్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల హాకీ సెక్రటరీలు వేణు, భాస్కర్, కోచ్‌లు జ్యోతి, సోనీ తదితరులు పాల్గొన్నారు.

దూరం తగ్గుతుందని ప్రాణాల మీదకు..!

రాంగ్ రూట్‌లోకి వెళ్లి ప్రమాదాలు ● నివారించేందుకు పోలీసులు కఠిన చర్యలు



బైకిస్ట్‌ను అడ్డుకుంటున్న గచ్చిబౌలి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి

- రాంగ్‌రూట్‌తో ట్రాఫిక్‌కు అంతరాయం
- ఇటీవల ప్రమాదానికి గురై సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతి
- కౌన్సెలింగ్ చేసినా మార్పు రావడం లేదు
- రాంగ్ రూట్‌పై స్పెషల్ డ్రైవ్‌లు

గచ్చిబౌలి: దూరం తగ్గుతుందని కొందరు రాంగ్ రూట్లను ఎంచుకుంటున్నారు. దీంతో కొన్నిసార్లు వారి ప్రాణాలకే ముప్పు వాటిల్లుతోంది. దూరం తగ్గించేందుకు వెళ్లే వారికే కాకుండా ఎదురుగా వచ్చే వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. రాంగ్ రూట్‌లో వెళ్లే వారికి అడ్డుకట్ట వేసేందుకు సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు రాంగ్ రూట్ కేసుల సంఖ్యను అంతకంతకు పెంచి అవగాహన కల్పించారు. అయిన బైకర్లలో మార్పు రావడం లేదు. దీంతో ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని సైబరాబాద్ జాయింట్ సీపీ (ట్రాఫిక్) జోయల్ డేవిస్ ఆదేశాలు జారీ చేశారు. ప్రమాదకరంగా వెళ్లే వారిపై గత రెండు నెలలుగా ఎఫ్ఆర్‌లు నమోదు చేస్తున్నారు. రాంగ్‌రూట్‌లో వెళ్లే వాహనదారులపై జరిమానాతోపాటు జైలు శిక్షలు సైతం పడే అవకాశం ఉందని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

ఐటీ కారిడార్‌లో రాంగ్ రూట్ పాయింట్లు

మాదాపూర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో సీఓడి జంక్షన్, అవాసా హోటల్, లేమన్ ట్రీ హోటల్, యశోద హాస్పిటల్, ఇనార్బిట్ మాల్‌రోడ్, రోడ్ నెంబర్–45, హైటెక్స్, గచ్చిబౌలి ట్రాఫిక్ పీఎస్ పరిధిలో ఎస్ఎల్ఎన్ టెర్మినల్, జీపీఆర్ క్వార్టర్స్, శ్రీరాం నగర్ కాలనీ, కిమ్స్ హాస్పిటల్, డీఎల్ఎఫ్ రోడ్డు, కొత్తగూడ జంక్షన్, గౌలిదొడ్డి, రాయదుర్గంలో ఆంధ్రాబ్యాంక్, బయో డైవర్సిటీ పార్క్, సౌత్‌ఇండియా షాపింగ్ మాల్, రాయదుర్గం, మల్కం చెరువు, ఖాజాగూడ తదితర ప్రాంతాలలో బైకిస్టులు రాంగ్ రూట్‌లో వెళుతున్నారు. ట్రాఫిక్ రద్దీ ఉండే ఉదయం సాయంత్రం వేళల్లో వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం కల్గిస్తున్నారు.





మాదాపూర్‌లో రాంగ్‌రూట్‌లో వెళుతున్న బైకిస్టులు

రాంగ్ రూట్‌కు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ బలి..

రాంగ్ రూట్‌కు వెళ్లి మరికొద్ది సేపట్లో ఉద్యోగంలో చేరాల్సిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతి చెందిన విషాద ఘటన చోటుచేసుకుంది. శ్రీకాకుళం జిల్లాకు చెందిన బలగ మనోజ్ కుమార్ (23)కు ఓ ఎంఎన్‌సీ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వచ్చింది. కొత్తగూడలో నివాసం ఉంటున్న మనోజ్ ఈ నెల 14న ఉదయం 7.40 గంటల సమయంలో ఉద్యోగంలో చేరేందుకు పల్సర్ బైక్‌పై బయలుదేరాడు, కొత్తగూడ జంక్షన్‌లో రాంగ్ రూట్‌లో వెళ్లి అటుగా వెళుతున్న సాయి అనే విద్యార్థి బైక్‌ను ఢీకొట్టి పడిపోయాడు. మనోజ్‌కు హెల్మెంట్ లేకపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సాయికి తీవ్ర గాయాలయ్యాయి. రాంగ్ రూట్‌లో వెళ్లడంతో మనోజ్ కుంటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

మూడేళ్లు జైలు శిక్ష...



రాంగ్‌రూట్‌లో ప్రయాణించే వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి సెక్షన్ 336 ప్రకారం కేసు నమోదు చేస్తున్నట్లు, మూడేళ్ల వరకు జైలు శిక్ష, జరిమానా విధించే అవకాశం ఉందని ఇటీవల సైబరాబాద్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్ మీడియాకు వెల్లడించారు. రాంగ్‌రూట్‌లో వెళ్లే వారి సంఖ్య తగ్గకపోవడంతో ఎఫ్ఐఆర్ నమోదును అమలు చేశామన్నారు. కమిషనరేట్ పరిధిలో రాంగ్‌రూట్‌లో వెళ్లే 124 ప్రాంతాలను గుర్తించామని, గత నెలలో 250 మంది వాహనదారులపై కేసులు నమోదు చేశామన్నారు. రాంగ్ రూట్‌లో వెళ్లే వారితో పాటు ఎదురుగా వచ్చే వారికి ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. సైబరాబాద్‌లో వాహనదారులు తస్మాత్ జాగ్రత్త, రాంగ్ రూట్‌లో వెళ్లారంటే జైలు శిక్ష తప్పదని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించి సహకరించాలని కోరుతున్నారు. – సైబరాబాద్ జాయింట్ సీపీ (ట్రాఫిక్) జోయల్ డేవిస్

ఆరు నెలల్లో 4961 కేసులు.. 36 ఎఫ్ఐఆర్‌లు నమోదు...

సైబరాబాద్ కమిషనరేట్‌లో ప్రతి రోజూ అత్యంత రద్దీగా ఉండే మాదాపూర్, గచ్చిబౌలి ట్రాఫిక్ పీఎస్‌ల పరిధిలో గత ఆరు నెలలుగా రాంగ్ రూట్‌లో వెళ్లే వారిపై 4961 మందిపై చలానాలు విధించారు. మాదాపూర్ ట్రాఫిక్ పీఎస్ పరిధిలో 2850, గచ్చిబౌలి ట్రాఫిక్ పీఎస్ పరిధిలో 2111 వాహనాలకు చలానా విధించి కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రమాదకరంగా వెళుతున్న ప్రాంతాలలో 36 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. గచ్చిబౌలి పరిధిలో 20 ఎఫ్ఐఆర్‌లు, మాదాపూర్ పరిధిలో 16లు నమోదయ్యాయి. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఈ నెల 21 రాంగ్‌రూట్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. 93 వాహనాలను సీజ్ చేసి 11 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు.



రాంగ్‌రూట్‌లో వెళ్లిన బైకిస్టులతో మాదాపూర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎస్.నర్సయ్య

ఆర్ట్ గ్యాలరీలో వాటర్ కలర్ వర్క్‌షాప్



వాటర్ కలర్ వర్క్‌షాప్‌లో మహిళా కళాకారులు

మాదాపూర్: మహిళా చిత్రకళాకారులు వేసిన చిత్రాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్‌ఆర్ట్‌గ్యాలరీలో ఉమెన్ ఆర్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆధివారం ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. దాదాపు 46 మంది మహిళా చిత్ర కళాకారులకు వాటర్‌కలర్ వర్క్‌షాప్‌ను నిర్వహించారు. అనంతరం కళాకారులుకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్‌గ్యాలరీ డైరెక్టర్ డాక్టర్ కె.లక్ష్మి, హైదరాబాద్ ఆర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రమణారెడ్డి, చిత్ర కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

హైటెక్స్‌లో ముగిసిన 'ఇండోమ్యాక్' ఎగ్జిబిషన్

మాదాపూర్: మాదాపూర్‌లోని హైటెక్స్‌లో నిర్వహిస్తున్న ఇండోమ్యాక్ ఎగ్జిబిషన్ ఆదివారంతో ముగిసింది. సెలవు రోజు కావడంతో సందర్శకులు ఎక్కువ సంఖ్యలో పాల్గొని వివిధ రకాల మిషనరీ యంత్రాలను గూర్చి అడిగి తెలుసుకున్నారు. ఎగ్జిబిషన్‌లో మెషిన్‌టూల్స్, ఆటోమెషిన్, రోబోటిక్స్, వెల్డింగ్, ఎలక్ట్రికల్, ఇండస్ట్రియల్, ఇంజినీరింగ్ ఉత్పత్తులు, సేవలు, భారీ, తేలికపాటి యంత్రాలు, యంత్ర పరికరాలు, ఉపకరణాలు, సాధనాలు, పాక్షిక సాంకేతిక పరికరాలు, ఇంజినీరింగ్ సాధనాలను ప్రదర్శించారు. స్టాల్స్ నిర్వాహకులు తమ ఉత్పత్తుల వివరాలను సందర్శకులకు వివరించారు. పలు కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే గాంధీకి విన్నవిస్తున్న కాలనీ వాసులు

హఫీజ్‌పేట్: మాదాపూర్ డివిజన్ పరిధిలోని గోకుల్ ప్లాట్స్‌లో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఆదివారం కాలనీవాసులు ఎమ్మెల్యే అరికెపూడి గాంధీని మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందించారు. కాలనీవాసులు మాట్లాడుతూ కాలనీలో అసంపూర్తిగా ఉన్న అంతర్గత సీసీ రోడ్లు మౌలిక వసతులు కల్పించాలని, అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి విన్నవించడం జరిగిందన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాలనీలో నెలకొన్న సమస్యలు దశలవారీగా పూర్తి చేస్తామన్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా అభివృద్ధి పనులు చేపడుతామన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు. కాలనీలో ఎలాంటి చిన్న సమస్య వచ్చిన తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు బ్రిక్ శ్రీను, గుమ్మడి శ్రీనివాస్, పూర్ణ, గోవింద్, శ్యామ్ కుమార్, శ్రీనివాస్, రోజా రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

హఫీజ్‌పేట్: మాదాపూర్ డివిజన్ పరిధిలోని సైబర్ విలేజ్‌లోని శ్రీ విజయ దుర్గాదేవి ఆలయ 5వ వార్షికోత్సవ వేడుకలలో ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, శేరిలింగంపల్లి ఇంచార్జి రవికుమార్ యాదవ్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించి, ఆశీస్సులతో అందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నారు. ఈ వార్షికోత్సవ వేడుకల్లో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

హమీద్‌కు శుభాకాంక్షలు



శేరిలింగంపల్లి: కొండాపూర్ కార్పొరేటర్ షేక్ హమీద్ పటేల్ జన్మదినోత్సవ వేడుకలను ఆదివారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి ఇంచార్జీ వి. జగదీశ్వర్‌గౌడ్ డోయన్స్ కాలనీలోని హమీద్ పటేల్ నివాసానికి చేరుకొని జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో సన్మానించారు. ఇలాంటి పుట్టిన రోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

కార్మికుల సంక్షేమానికి కృషి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం భెల్ టౌన్‌షిప్‌లోని పెన్నార్ పరిశ్రమ యాజమాన్యం ఆధ్వర్యంలో జరిగిన అమ్మవారి పూజా కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికులు, యాజమాన్యం మధ్య మంచి సంబంధాలున్నప్పుడే పరిశ్రమ అభివృద్ధి పథంలో సాగుతుందన్నారు. కార్మికులకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని తెలిపారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు





మాదాపూర్: కళాకారులు కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలతో సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహించే వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆదివారం కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలను ప్రదర్శించి అలరించారు. కువైట్‌లో పుట్టి పెరిగి అకాడెమ్ సంప్రదాయ కూచిపూడిలో గురువు వేదవల్లి వద్ద శిక్షణ తీసుకుని కళాకారిణి అనన్య సూరపనేని తన కూచిపూడి ప్రదర్శనతో అలరించింది. ఇందులో సరస్వతి వందన, కళాసాపురము కాదా, కృష్ణలీలలు, ధనశ్రీ తిల్లాన తదితర అంశాలను ప్రదర్శించి అలరించారు. శంకరానంద కళాక్షేత్రం గురువు పద్మశ్రీ ఆనందశంకర్ జయంత్ శిష్యబృందం భరతనాట్య ప్రదర్శనతో అలరించారు. ఇందులో పుష్పాంజలి, దేవి కీర్తనం, దశావతారం, తిల్లాన తదితర అంశాలను శ్రేయ, ఆరాధ్య, లక్ష్య, సమన్వి, సహన, సాయి, మేధాశ్రీలు ప్రదర్శించి అలరించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



శేరిలింగంపల్లి: ఎంతస్థాయికి ఎదిగినా చిన్ననాటి రోజులు మళ్లీ రావని పలువురు పేర్కొన్నారు. శేరిలింగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (2006–07) బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. పదో తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు 17 ఏళ్ళ తరువాత కలసి వేడుకగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమ్మేళనానికి హాజరైన వంద పూర్వ విద్యార్థులు ఏఏ ఉద్యోగాలు చేస్తున్నారో, వారి కుటుంబ విషయాలను తెలుసుకొని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి అప్పటి ఉపాధ్యాయులు బాల్‌రెడ్డి, రాజేష్, నర్సింహారావు, కుసుమలత, ప్రసన్న, బాలశివారెడ్డి," ఎలక్ష్మయ్య, చిన్న లక్ష్మయ్య తదతరులు హాజరు కాగా వారిని ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు శివాజీ, రాజేష్, అశోక్, మహేందర్, రాజు పాల్గొన్నారు.

కలుషిత నీటితో చేపలు మృత్యువాత



గోపన్‌పల్లితండా-గోపన్‌పల్లి మధ్యన ఉన్న చిన్నాపెద్ద చెరువులో మృత్యువాత పడిన చేపలు

- ఆందోళన వ్యక్తం చేస్తున్న మత్స్యకారులు
- చెరువును పరిశీలించిన కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: చెరువు నీళ్లన్నీ కలుషితం అవడంతో అందులోని చేపలు ఆదివారం మృత్యువాత పడ్డాయి. మత్స్యకారులు గత కొన్ని రోజులుగా అధికారుల దృష్టికి తెచ్చినా ఫలితం లేకుండా పోవడంతో పరిస్థితి ఇలా మారిందని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలుష్యం పెరిగిపోవడంతో చెరువులోని నీళ్ళని కలుషితం కావడంతో చేపలు మృత్యువాత పడినట్లుగా మత్స్యకారులు అభిప్రాయపడుతున్నారు. పెద్దసంఖ్యలో చేపలు పెంచామని కానీ ప్రస్తుతం ఇలా అవి మృత్యువాత పడడంతో తీవ్ర నష్టాన్ని చవిచూడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతకొంత కాలంగా చుట్టూరా డ్రైన్లు, పైప్‌లైన్ల ద్వారా చెరువులోకి మురుగునీరంతా వచ్చి చేరుతోందని దీంతో చెరువు నీళ్ళన్నీ కలుషితం అవుతున్నాయని తెలిసినా పట్టించుకోకపోవడంతోనే ఈ పరిస్థితి వచ్చిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటిని శుభ్రం చేసేందుకు ఎస్టీపీ ఉన్నా ఫలితం రావడం లేదని వారు పేర్కొంటున్నారు.

ఆక్సిజన్ అందకనే...

గోపన్‌పల్లి చెరువులో నీటి కాలుష్యంతోనే చేపలకు ఆక్సిజన్ సక్రమంగా అందక అవి మృత్యువాత పడ్డాయని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం సాయంత్రం ఆయన చెరువును స్థానికులు, మత్స్యకారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెద్ద సంఖ్యలో చేపలు మృతి చెందడం ఆవేదన కలిగిస్తోందని, మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు రంగస్వామి, నగేష్, విక్రమ రంగస్వామి, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

జేఏసీ ఎన్నిక

జిన్నారం(పటాన్‌చెరు): కాలుష్య నివారణ కోసం న్యాయ పోరాటం చేస్తామని, తాము చేస్తున్న పోరాటంలో ప్రతి ఒక్కరు పాల్గొనాలని ప్రముఖ న్యాయవాది, పర్యావరణ వేత్త దండె రమాకాంత్ పిలుపునిచ్చారు. మండలంలోని ఖాజీపల్లి ప్రజలు కాలుష్యంతో ఇబ్బందులు పడుతుండడంతో ఆయన ఆధ్వర్యంలో పోరాటం చేపట్టారు. ఆదివారం జాయింట్ యాక్షన్ కమిటీని ఎన్నికున్నారు. రమాకాంత్ జేఏసీ అధ్యక్షుడుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మరో 24 మంది కార్యవర్గ సభ్యులను ఎంపిక చేశారు.

అభివృద్ధే లక్ష్యంగా ముందుకు..

జెడ్పీటీసీ కుమార్‌గౌడ్

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని అన్ని గ్రామాలను పూర్తిస్థాయిలో అభివృద్ధిచేసే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని గుమ్మడిదల జెడ్పీటీసీ కుమార్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలతోపాటు మండల కేంద్రాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు.

శ్యామాప్రసాద్ ముఖర్జీని ఆదర్శంగా తీసుకోవాలి



ఎంఐజీలో మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

ఎంఐజీలో మొక్కలు నాటిన బీజేపీ నాయకులు

శేరిలింగంపల్లి: శ్యామాప్రసాద్ ముఖర్జీని ప్రతి కార్యకర్త ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ అర్బన్ జిల్లా ఉపాధ్యక్షుడు తోపుగొండ మహిపాల్‌రెడ్డి కోరారు. జన సంఘ్ వ్యవస్థాపకుడు శ్యామాప్రసాద్ ముఖర్జీ (వర్ధంతి) బలిదాన్ దివస్ కార్యక్రమాన్ని ఎంఐజీలో బీజేపీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మొక్కలు నాటారు. అనంతరం జరిగిన సమావేశంలో అర్బన్ జిల్లా ఉపాధ్యక్షుడు తోపుగొండ మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతికార్యకర్త శ్యామాప్రసాద్ దేశ ఐక్యత కోసం ఎంతో కృషి చేశారన్నారు. ఒక దేశానికి రెండు రాజ్యాంగాలు, ఇద్దరు ప్రధానులు, రెండు జెండాలు ఉండకూడదని దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేశారని గుర్తు చేశారు. మే 11, 1953లో వేలాది మందితో ఢిల్లీ నుంచి జమ్మూకశ్మీర్‌లోకి ప్రవేశించేందుకు బయలు దేరారని గుర్తు చేశారు. జమ్మూకశ్మీర్‌లో ఆయనను శ్రీనగర్‌లో అరెస్ట్ చేసి పాడుబడ్డ గృహంలో ఉంచారన్నారు. జూన్ 23, 1953లో అర్ధరాత్రి ఆయన చనిపోయారని పోలీసులు తెలిపారని పేర్కొన్నారు. అప్పటి నుంచి ఆయన ఆశయాన్ని ఇప్పటి ప్రధాని నరేంద్రమోడీ 370 ఆర్టికల్‌ను రద్దు చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.